బషీర్‌బాగ్‌లో జరిగిన వర్క్‌షాప్‌లో యూఎస్ కాన్సులేట్ జెన్నీఫర్ లార్సన్, మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కే శ్రీనివాస్, విరాహత్ అలీ, భీమారావు

వాతావరణ మార్పులపై వర్క్‌షాప్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): అమెరికన్ కాన్సులేట్ జనరల్ హైదరాబాద్, ఒడిశాకు చెందిన వ్యూస్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 'వాతావరణ మార్పులు-జర్నలిస్టులకు అవగాహన' వర్క్‌షాప్ గురువారం బషీర్‌బాగ్‌లో ప్రారంభమైంది. దీనికి తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయుడబ్ల్యూజే) సహకారం అందిస్తున్నది. కార్యక్రమంలో యూఎస్ కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి, ఆంధ్రజ్యోతి ఎడిటర్ కే శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ,వ్యూస్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ భీమారావు, యూఎస్ కాన్సులేట్ సీపీఆర్వో బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

మార్చిలోనే మాడు పగిలే ఎండలు!

హైదరాబాద్‌లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత • నెల ముగిసేసరికే 45 డిగ్రీల వరకు..

- అత్యవసరమైతేనే బయటకు వెళ్లండి
- ప్రజలకు వాతావరణ శాఖ వార్నింగ్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఎండలు దంచి కొడుతున్నాయి. మార్చిలో మధ్యనే మాడ పగిలేలా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. రెండు మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు మరింత అధికమయ్యాయి. ప్రస్తుతం మధ్యాహ్నం నుంచి తీవ్ర వడగాల్పులు వీస్తున్నాయి. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండ దంచి కొడుతున్నది. మధ్యాహ్నం వేళ ఉక్కపోత తీవ్ర ఇబ్బంది పెడుతున్నది. ఉదయం 9 దాటితే భానుడు భగభగ మండుతుండటంతో ప్రజలు ఇండ్ల నుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. ఎల్‌నినో ప్రభావంతో మార్చిలోనే రికార్డుస్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఇదే మొదటిసారి అని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వచ్చే వారం ఎండలు మరింత పెరిగే అవకాశం ఉన్నదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. హైదరాబాద్‌లో బుధవారం ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. ఈ నెల ముగిసేసరికే 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశమున్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. రహదారులపై సిగ్నళ్ల వద్ద ద్విచక్ర వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు.

11-3.30 మధ్యన బయటకు వెళ్లొద్దు

ఎండల్లో తిరిగేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరని డాక్టర్లు సూచించారు. ఎండతీవ్రతతో శరీరం పొడిబారడం, ఎర్రగా మారడం, తలనొప్పి, దురదలు, వాంతులు, స్పృహ కోల్పోవడం వంటివి సంభవిస్తే వెంటనే డాక్టర్లను సంప్రదించాలని తెలిపారు. బీపీ, షుగర్, గుండె జబ్బులు, చర్మవ్యాధులతో బాధపడేవారు వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ లేదా ఉప్పు కలిపిన మజ్జిగ, ఉప్పు, చక్కెర కలిపిన నిమ్మరసం తీసుకుంటే.. లవణాలు అందుతాయని చెప్పారు. సూర్యోదయానికి ముందే వ్యాయామం చేయాలని, అతిగా మాంసాహారం తీసుకోవద్దని హెచ్చరించారు. అత్యవసరం అయితేతప్ప ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల మధ్య బయటకు వెళ్లకపోవటమే ఉత్తమమని వాతావరణశాఖ నిపుణులు సూచించారు.

లోకం పోకడ

కోటి సంగతి తర్వాత.. ముందు నీటికొరత తీర్చండి!

మీడియాతో మాట్లాడుతున్న దేవీప్రసాద్. చిత్రంలో నగేశ్, రూప్‌సింగ్

ఉద్యోగుల్లో చీలికకు కాంగ్రెస్ యత్నం

కోడ్ రాక ముందే డీఏలు విడుదల చేయాలి

ఒకటో తేదీన అందరికీ జీతాలు రావడం లేదు: బీఆర్ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ సంఘాల్లో చీలికతెచ్చే ప్రయత్నం చేస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు, ఉద్యోగ సంఘాల నేత దేవీప్రసాద్ విమర్శించారు. పాలకులు, కాంగ్రెస్ పార్టీ నేతలు ఉద్యోగ సంఘాల్లో మితిమీరిన జోక్యం చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే సీఎం రేవంత్ రెడ్డి ఉద్యోగుల డీఏ, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మూడు డీఏలను తక్షణం చెల్లిస్తామని కాంగ్రెస్ ఎన్నికలకు ముందు చెప్పిందని, కానీ మూడు నెలలైనా ఆ ఊసే ఎత్తడం లేదని, ప్రస్తుతం నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఒకటో తేదీనే జీతాలు ఇస్తున్నామని పాలకులు గొప్పలు చెప్పుకుంటున్నారని, చాలామందికి మొదటి తేదీనాడు జీతాలు రావడమే లేదని తెలిపారు. ఉద్యోగ సంఘాలకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం గౌరవం ఇచ్చిందని, ఐదు శాతం ఐఆర్ ఇచ్చిందని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానివి మాటలే తప్ప చేతల్లో ఏమీలేదని విమర్శించారు. అనేక హామీలు ఇచ్చి నేడు అర చేతిలో వైకుంఠం చూపుతున్నారని ధ్వజమెత్తారు.

సాగర్ ఎడమకాల్వ కింద ఎండుతున్న పంటలు

నాగార్జునసాగర్ ఎడమకాల్వ కింద పంటలు ఎండిపోతున్నా కాంగ్రెస్ పాలకులు పట్టించుకోవడం లేదని దేవీప్రసాద్ ధ్వజమెత్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఇవ్వాళ రైతుల పరిస్థితి చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. మంత్రులు కేసీఆర్‌ను తిట్టడంలో పోటీపడుతున్నారని, ఇకనైనా ఈ తిట్లు మాని ప్రజల బాగోగులు చూసుకోవాలని హితవు పలికారు. బెంగళూరులాగా హైదరాబాద్‌ను చేయొద్దని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించడం.. తాగునీటి సరఫరాలో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమేనని చెప్పారు. సమావేశంలో బీఆర్ఎస్ నేతలు గజ్జెల నగేశ్, రూప్‌సింగ్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ సమావేశంలో పాల్గొన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. చిత్రంలో జోగు రామన్న, వేణుగోపాలాచారి, కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్ తదితరులు

మల్కాజిగిరి బరిలో రాగిడి లక్ష్మారెడ్డి

ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు

ప్రకటించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ • ఇప్పటివరకు 11 స్థానాలు ఖరారు

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో బరిలోకి దిగే మరో ఇద్దరు అభ్యర్థులను బీఆర్ఎస్ ఖరారు చేసింది. మల్కాజిగిరి స్థానాన్ని రాగిడి లక్ష్మారెడ్డికి, ఆదిలాబాద్‌ను ఆత్రం సక్కుకు కేటాయించినట్టు పార్టీ అధినేత కేసీఆర్ గురువారం ప్రకటించారు. వీరితో కలిపి ఇప్పటివరకు 11 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. హైదరాబాద్‌లోని తన నివాసంలో కేసీఆర్ గురువారం ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో సమావేశమయ్యారు. మాజీ మంత్రులు జోగు రామన్న, సముద్రాల వేణుగోపాలాచారి, ఎమ్మెల్సీ దండె విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్‌జాదవ్, పార్టీ నేతలు రవీందర్ రావు, లోలం శ్యాంసుందర్ తదితరులతో సమావేశమైన కేసీఆర్ ఆదిలాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని రాజకీయ, సామాజిక అంశాలతోపాటు క్షేత్రస్థాయిలో నెలకొన్న పరిస్థితులపై ఆరాతీశారు.

బీఆర్ఎస్ ప్రకటించిన 9 స్థానాలు ఇవే

లోక్‌సభ స్థానం	బీఆర్ఎస్ అభ్యర్థి
ఆదిలాబాద్	ఆత్రం సక్కు
మల్కాజ్‌గిరి	రాగిడి లక్ష్మారెడ్డి
ఖమ్మం	నామా నాగేశ్వర్‌రావు
మహబూబాబాద్ (ఎస్టీ)	మాలోత్ కవిత
కరీంనగర్	బోయినపల్లి వినోద్‌కుమార్
పెద్దపల్లి(ఎస్సీ)	కొప్పుల ఈశ్వర్
మహబూబ్‌నగర్	మన్నె శ్రీనివాస్‌రెడ్డి
చేవెళ్ల	కాసాని జ్ఞానేశ్వర్
వరంగల్ (ఎస్సీ)	డాక్టర్ కడియం కావ్య
జహీరాబాద్	గాలి అనిల్‌కుమార్
నిజామాబాద్	బాజిరెడ్డి గోవర్ధన్

కాంగ్రెస్, బీజేపీలకు గుణపాఠం తప్పదు: పోచారం

బాన్సువాడ టౌన్, మార్చి 14: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. బీఆర్ఎస్ జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థిగా ఎంపికైన గాలి అనిల్‌కుమార్ గురువారం బాన్సువాడలో శ్రీనివాసరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఆయనతో చర్చించినట్టు సమాచారం.

గనుల శాఖలో భారీగా బదిలీలు

హైదరాబాద్, మార్చి 14(నమస్తే తెలంగాణ): గనులు, భూగర్భ వనరుల శాఖలో భారీగా అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ జాబితాలో ముగ్గురు డిప్యూటీ డైరెక్టర్లు, 21 మంది అసిస్టెంట్ డైరెక్టర్లు, 22 మంది అసిస్టెంట్ జియాలజిస్టులు, 33 మంది రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు. హైదరాబాద్‌లో పనిచేస్తున్న డిప్యూటీ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లును వరంగల్‌కు, వరంగల్‌లో ఉన్న డిప్యూటీ డైరెక్టర్ పీ మధుసూదన్‌రెడ్డిని నిజామాబాద్‌కు బదిలీ చేశారు. వెయింటింగ్‌లో ఉన్న డిప్యూటీ డైరెక్టర్ కే నర్సింహారెడ్డిని హైదరాబాద్‌కు బదిలీ చేశారు.

గొర్రెల పంపిణీ కేసులో మరో ఇద్దరి అరెస్టు

ఏసీబీ అదుపులో జేడీ, ఏడీ.. ఆరుగురికి చేరిన సంఖ్య

హైదరాబాద్, మార్చి 14 (నమస్తే తెలంగాణ): గొర్రెల పంపిణీ పథకం కేసులో ఏసీబీ మరో ఇద్దరు అధికారులను అరెస్టు చేసింది. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టు చేసిన నిందితుల సంఖ్య ఆరుకు చేరుకున్నది. ఈ కేసులో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్, రంగారెడ్డి జిల్లా వెటర్నరీ, పశుసంవర్ధక శాఖ అధికారి అయిన అంజిలప్ప (ఏ7)ను, ఇదే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ పీ కృష్ణయ్యను ఏసీబీ గురువారం అదుపులోకి తీసుకున్నది. విచారణ అనంతరం నిందితులను ఏసీబీ కోర్టులో ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చగా, వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. గొర్రెల కొనుగోలు విషయంలో వీరు ఉద్దేశపూర్వకంగా ప్రైవేటు వ్యక్తులను చేర్చి, వారి ఆదేశాలను పాటించేలా సూచనలు చేసినట్టు విచారణలో తేలింది. వీరు కలెక్టర్‌కు పంపిన నకిలీ అమ్మకందారుల వివరాలతో నిజమైన వారు కాకుండా, నకిలీ అమ్మకందారులు డబ్బు పొందారని, దీంతో ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లినట్టు అధికారులు పేర్కొన్నారు.

జేఎల్ కావాలా?

మొదటిపేజీ తరువాయి...

కేటాయించడంతో కొందరు బ్రోకర్లు అక్రమాలకు తెరతీశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 1:2 జాబితాలో ఉన్న అభ్యర్థులతో బేరసారాలకు దిగారని బాహటంగా చర్చించుకుంటున్నారు. ముఖ్యంగా రాత పరీక్షలో తక్కువ మార్కులొచ్చిన అభ్యర్థులను గుర్తించి, వారితో బేరసారాలు నడిపి రూ.10 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్టు పరీక్ష రాసినవారు ఆరోపిస్తున్నారు. భారీ మొత్తంలో డబ్బులు ముట్టజెప్పినవారికి డెమో మార్కులు అధికంగా వేయించి తుది జాబితాలో ఎంపికయ్యేలా చేస్తామంటూ ఆశ చూపుతున్నారని వారు అంటున్నారు. డెమో మార్కుల కేటాయింపులో అక్రమాల వల్లే రాత పరీక్షలో మంచి మార్కులొచ్చినవారికి కూడా తుది జాబితాలో చోటు దక్కలేదని పలువురు అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ నేపథ్యంలో రాతపరీక్షకు హాజరైన పలువురు అభ్యర్థులు ప్రజాభవన్ వద్ద నిరసనకు దిగడం గమనార్హం. దీనిపై ప్రజాభవన్ ప్రజావాణిలో ఇప్పటికే నాలుగుసార్లు ఫిర్యాదు చేశామని, అయినా ప్రభుత్వం నుంచి స్పందన లేదని అభ్యర్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ప్రజావాణిలో మొదటిసారి దరఖాస్తును అందజేసినప్పుడు అక్‌నాలెడ్జ్‌మెంట్‌తోపాటు, దరఖాస్తును స్వీకరించినట్టు మొబైల్‌కు మెస్సేజ్ వచ్చిందని, కానీ ఆ తరువాత దరఖాస్తు అందజేస్తే అటువంటి మెస్సేజ్‌లు కూడా రాలేదని చెప్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి జేఎల్, డీఎల్ పోస్టుల భర్తీపై పూర్తిస్థాయి విచారణ జరపాలని, డెమోలను మరోసారి నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

- జేఎల్, డీఎల్ పోస్టులకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ చేసిన సందర్భంలోనే సబ్జెక్టుల వారీగా, మల్టీజోనల్ స్థాయిలో ఉన్న ఖాళీలు, జనరల్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా రిజర్వేషన్, స్పోర్ట్స్, ఎక్స్ సర్వీస్ మెన్స్ తదితర కోటా కింద కేటాయించిన పోస్టుల వివరాలన్నీ ట్రిబ్ స్పష్టంగా పేర్కొన్నది. అయితే, దానిని అమలు చేసిందో, లేదో తెలియని పరిస్థితి నెలకొన్నది. మరోవైపు జేఎల్, డీఎల్ పోస్టులకు సంబంధించి ఇప్పటివరకు థియరీ మార్కులను కూడా ప్రకటించలేదు. రాతపరీక్షకు సంబంధించిన తుది కీని మాత్రమే విడుదల చేసింది. రిజర్వేషన్ల ప్రకారం కటాఫ్ మార్కులు, డెమో మార్కుల జాబితా ఊసేలేదు. నేరుగా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల 1:1 జాబితాను ప్రకటించింది. అదీ సదరు అభ్యర్థుల హాల్‌టికెట్ల నంబర్లను మాత్రమే వెల్లడించింది. దీంతో గురుకుల అభ్యర్థుల్లో అనుమానాలు తలెత్తుతున్నాయి.
- సాధారణంగా డెమో నిర్వహించినప్పుడు సదరు అభ్యర్థులకు చాక్‌పీస్, బ్లాక్‌బోర్డును ఏర్పాటుచేయాల్సి ఉండగా, ట్రిబ్ అందుకు విరుద్ధంగా వ్యవహరించిందని చెప్తున్నారు. సబ్జెక్టులవారీగా అభ్యర్థులు ఎంచుకున్న టాపిక్‌తోపాటు, ట్రిబ్ సైతం ఆయా సబ్జెక్టులకు సంబంధించిన ఒక టాపిక్‌ను ఇచ్చి అభ్యర్థి టీచింగ్ నైపుణ్యం, విషయ పరిజ్ఞానం తదితర అంశాలను పరిశీలించి మార్కులు వేస్తుంది. కానీ, జేఎల్, డీఎల్ పోస్టులకు సంబంధించిన డెమోలను పూర్తిగా మౌఖికంగా నిర్వహించడం గమనార్హం. అభ్యర్థులకు చాక్‌పీస్, బోర్డు ఇవ్వలేదని, కేవలం సబ్జెక్టులకు సంబంధించి మౌఖికంగా ప్రశ్నలు అడిగారని, అది కూడా రెండు నిమిషాలకు మించి సమయం ఇవ్వలేదని 1:2 జాబితాలోని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. నోటిఫికేషన్ ప్రకారం పోస్టులకు సంబంధించి అన్ని అర్హతలు ఉన్నా మైక్రోబయోలజీ, బయోటెక్నాలజీ తదితర పోస్టులకు సంబంధించి పలువురు అభ్యర్థులను డెమోలకు కూడా ఆహ్వానించలేదు. దీంతో వారు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ట్రిబ్ ప్రతి అంశంలోనూ గోప్యత పాటిస్తుండటంతో అభ్యర్థుల్లో అనుమానాలు, అపోహలు పెరుగుతున్నాయి.
- ట్రిబ్ గోప్యత పాటిస్తున్న నేపథ్యంలో ఇటీవల పలువురు పీడీ, పీజీటీ, జేఎల్, డీఎల్ అభ్యర్థులు సమాచారహక్కు చట్టం కింద ట్రిబ్‌కు దరఖాస్తు పెట్టారు. కటాఫ్ మార్కుల జాబితాను కోరుతూ అప్పిలేట్ చేసుకున్నారు. గత నెల 15న దరఖాస్తు చేసినా ఇప్పటివరకు ట్రిబ్ సదరు దరఖాస్తుదారుడికి సమాచారాన్ని ఇవ్వకపోవడం గమనార్హం.
- పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, టీఎస్‌పీఎస్సీ, ఇతర రిక్రూట్‌మెంట్ బోర్డులు తాము చేపట్టిన నియామకాలకు సంబంధించి పూర్తిగా పాదర్శకతను పాటిస్తున్నాయి. ఆయా పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాతోపాటు డేట్ ఆఫ్ బర్త్ వివరాలు, హాల్‌టికెట్ నెంబర్లను సైతం తమ తమ సైట్లలో బహిరంగానే ప్రదర్శిస్తున్నాయి. కానీ, ట్రిబ్ మాత్రం రిజల్ట్ ప్రకటించి 15 రోజులు గడుస్తున్నా ఈ విషయంలో గోప్యత పాటిస్తుండటం అక్రమాలు జరిగాయనే ఆరోపణలకు అవకాశమిస్తున్నది.

బ్యాక్‌లాగ్ భర్తీ చేయాలని నిరుద్యోగి దీక్ష

గురువారం ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురంలో రిలే నిరాహార దీక్ష చేస్తున్న నిరుద్యోగి తుమ్మల జయరాజు

కల్లూరు, మార్చి 14 : రాష్ట్రంలోని గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం జిల్లా కల్లూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన తుమ్మల జయరాజు తన ఇంటి వద్ద గురువారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆగస్టు 2023లో గురుకుల పోస్టుకు పరీక్ష రాసి 1:2 పద్ధతిలో ఇంటర్వ్యూకు వెళ్లినట్టు తెలిపారు. తనకంటే ముందున్న అభ్యర్థి పీజీటీ, జేఎల్, డిగ్రీ లెక్చరర్ పోస్టులకు అర్హత సాధించడంతో ఆయా పోస్టులు కోల్పోయినట్టు ఆవేదన వ్యక్తంచేశారు. ఒకే అభ్యర్థి మూడు పోస్టులకు ఎంపిక కావడంతో బ్యాక్‌లాక్ పోస్టులు మిగిలిపోయి తనలాంటి వారికి అన్యాయం జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో 9,210 పోస్టులకు ప్రభుత్వం అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఆహ్వానించగా.. ఇందులో నాలుగు వేల పోస్టులు బ్యాక్‌లాగ్ కింద మిగిలిపోయాయని, వెంటనే వాటిని భర్తీ చేసి తనలాంటి వారికి న్యాయం చేయాలని కోరారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలంటూ హైదరాబాద్‌లో ఆన్‌లైన్ అకాడమీ డైరెక్టర్ అశోక్ ఐదు రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్నారని, ఆయనకు మద్దతుగా తాను కూడా రిలే దీక్ష చేపట్టినట్టు ఆయన పేర్కొన్నారు.

స్పందించని సర్కార్

గురుకుల పోస్టుల భర్తీకి సంబంధించి అభ్యర్థులు అనేక అభ్యంతరాలు, అనుమానాలను వ్యక్తంచేస్తున్నా, ఆందోళనకు దిగుతున్నా ట్రిబ్ పట్టించుకోవడం లేదు. ట్రిబ్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నా రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా మౌనం వహిస్తున్నది. అభ్యర్థుల అనుమానాలు, విజ్ఞాపనలకు ఏవిధమైన జవాబు ఇవ్వడం లేదు. సందేహాలను నివృత్తి చేసేవిధంగా ట్రిబ్ వ్యవహరించడం లేదు. పోస్టులు అమ్ముకున్నారనే ప్రచారం జోరుగా సాగుతున్నా, రీలిక్విష్‌మెంట్ అంశం తేల్చాలని డిమాండ్ చేస్తున్నా పట్టనట్టుగానే వ్యవహరిస్తున్నది. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే త్వరలోనే వేలాదిగా తరలివచ్చి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరిస్తున్నారు.

డ్యామ్‌ల భద్రత.. అధికారులదే బాధ్యత!

- ప్రతీ ఆనకట్టకూ డిజిటల్ లాగ్‌బుక్
- పకడ్బందీగా రక్షణ నిబంధనలు
- ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాలు జారీ

హైదరాబాద్, మార్చి14 (నమస్తే తెలంగాణ): ఆనకట్టల భద్రతకు అధికారులే బాధ్యులని ఎన్‌డీఎస్‌ఏ (నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ) కీలక సిఫారసులు చేసింది. చీఫ్ ఇంజినీర్ మొదలు దిగువస్థాయి జేఈల వరకు బాధ్యులను చేయడంతోపాటు, సదరు అధికారులకు ఉండాల్సిన అర్హతలు, అనుభవం, పొందాల్సిన శిక్షణపై కూడా స్పష్టమైన సూచనలు చేసింది. జలాశయాల నిఘా, తనిఖీ, ఆపరేషన్, నిర్వహణ, రక్షణ, ప్రమాదాలకు బాధ్యులను నిర్ధారిస్తూ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021ని అనుసరించి ఎన్‌డీఎస్‌ఏ సిఫారసులు-2023 పేరిట కేంద్రం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మేరకు గురువారం ఎన్‌డీఎస్‌ఏ చైర్మన్ అనిల్‌జైన్ గెజిట్‌ను విడుదల చేశారు. దీనిలో డ్యామ్‌ల రక్షణకు సంబంధించి పలు కీలకమైన అంశాలను పేర్కొన్నది. ఆనకట్టల భద్రతను పర్యవేక్షణకు సంబంధించి నియమించాల్సిన అధికారుల అర్హతలను తెలపడంతోపాటు, ప్రమాదాలకు బాధ్యత వహించాల్సిన అధికారులకు సంబంధించిన నిబంధనలను కూడా స్పష్టం చేసింది. డ్యామ్ సేఫ్టీ చట్టాన్ని అనుసరించి నిర్దేశించిన ప్రతి ఆనకట్టకు సంబంధించిన డిజిటల్ లాగ్‌బుక్‌లను, డేటాబేస్‌ను ప్రతీ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) తప్పకుండా నిర్వహించాలని పేర్కొన్నది. సాంకేతికాంశాలను డిజిటల్ రూపంలో పొందుపరచాలని నిర్దేశించింది.

ప్రమాదాలకు బాధ్యులు వీరే

ప్రాజెక్టుల్లో సంభవించే ప్రమాదాలపై కూడా ఎన్‌డీఎస్‌ఏ కీలక సిఫారసులను చేసింది. ప్రాజెక్టుల్లో ఎప్పుడు, ఎలాంటి ప్రమాదం సంభవించింది? ఫలితంగా ఏ నిర్మాణం దెబ్బతిన్నది? సీపేజీ తీరు, గుర్తించిన లీకేజీలు, భూకంపాలు, మట్టికోతకు గురవడం వంటివి ఏమైనా సంభవించాయా? అన్న వివరాలను క్రోడీకరించాలని కేంద్రం పేర్కొన్నది. ఏ అధికారి, ఏ రోజున తనిఖీ చేశారు? ఏం పరిశీలించారు? ప్రమాద నివారణకు చేసిన సిఫారసులు ఏమిటి? నిర్దేశిత సమయంలో సిఫారసు చేసిన పనులు పూర్తయ్యాయా? వంటి వివరాలను కూడా క్రోడీకరించాలని కేంద్రం స్పష్టం చేసింది. ఆనకట్టల భద్రతకు చీఫ్ ఇంజినీర్ మొదలు దిగువ జేఈల వరకు బాధ్యులను చేయడంతోపాటు, సదరు అధికారులకు ఉండాల్సిన అర్హతలు, అనుభవం, పొందాల్సిన శిక్షణపై కూడా స్పష్టమైన సిఫారసులు చేసింది. నిర్దేశిత డ్యామ్‌ల పరిశోధన, రూపకల్పన, నిర్మాణంలో పాటించాల్సిన నిబంధనలు, ఇంజినీర్ల అనుభవం, అర్హతలను సైతం నిర్దేశించింది. ప్రాజెక్టుల ఎత్తు, నీటి నిల్వ సామర్థ్యాన్ని అనుసరించి చీఫ్ ఇంజినీర్ మొదలు ఏఈ వరకు బాధ్యులుగా నిర్దేశించింది. అత్యవసర కార్యాచరణ ప్రణాళికలపై పలు సిఫారసులు చేసింది.

ఎంబీఏ విద్యార్థిని ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

కలకలం సృష్టించింది. ఇది గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు చేరుకున్న చైతన్యపురి పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా దవాఖానకు తరలించారు. ఈ ఆత్మహత్యకు ములుగు జిల్లా వెంకటాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు కుమారుడు చిడెం హరీశ్ కారణమని బంధువులు ఆరోపించారు. హరీశ్ తన తండ్రి అండ చూసుకుని సాహితిని వేధింపులు, బెదిరింపులకు గురిచేశాడని మృతురాలు తండ్రి, సోదరుడు విలపించారు. హరీశ్ వేధిస్తున్న విషయం తమకు రెండు రోజుల క్రితమే తెలిసిందని, ఇంతలోనే ఈ ఘోరం జరిగిందని కన్నీంటిపర్యంతమయ్యారు. సాహితిని వేధిస్తూ, బెదిరిస్తూ వాట్సప్‌లో వందల చాటింగ్‌లు చేశాడని పేర్కొన్నారు. హరీశ్ వ్యవహారశైలిని మోహన్‌రావు దృష్టికి తీసుకెళ్తే.. ఆయన కూడా ఏం చేసుకుంటారో చేసుకోండంటూ సాహితిని బెదిరించాడని, దీంతో దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. తండ్రి రాజకీయ అండ చూసుకొని తమ కుమార్తెను మానసికంగా వేధించిన హరీశ్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సాహితి మృతితో ఆ స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదిలా ఉండగా గురువారం పోస్టుమార్టం నిర్వహించిన ఉస్మానియా ఫోరెన్సిక్ వైద్యులు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబసభ్యులు మృతదేహాన్ని ములుగు జిల్లాలోని స్వగ్రామానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చైతన్యపురి సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

ఎండిన పైరుతో.. ఎర్రటి ఎండలో..

మొదటిపేజీ తరువాయి...

పురుగుల మందు డబ్బాలతో రైతులు

కోసం నిరసన తెలుపగా, ఆర్డీవో హనుమానాయక్ రెండు రోజుల్లో నీరందిస్తామని హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు. అయితే వారం దాటినా నీటిని విడుదల చేయడంతో మళ్లీ ఆందోళన బాట పట్టారు. విషయం తెలుసుకున్న ఆర్డీవో హనుమానాయక్, ఈఈ బలరాంనాయక్ రైతుల వద్దకు వచ్చి శాంతిపజేసేందుకు విఫలయత్నం చేశారు. గతంలో నీళ్లిస్తామన్న హామీని ఎందుకు నెరవేర్చలేదని నిలదీశారు. దీంతో గోదావరిఖని ఏసీపీ రమేశ్ సమస్యను కలెక్టర్, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళనను విరమించారు.

కులవృత్తుల కార్పొరేషన్ల ఏర్పాటుకు ఉత్తర్వులు

హైదరాబాద్, మార్చి16 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం 9 కులవృత్తుల కార్పొరేషన్లను ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈబీసీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డును, గంగపుత్ర, మేర, లింగాయత్, పెరిక, పద్మశాలి, మున్నూరుకాపు, యాదవ కురుమ, ముదిరాజ్ కులాల కార్పొరేషన్లను కోఆపరేటివ్ సొసైటీ కింద ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది.

పంటలకు నీళ్లు ఇవ్వలేం

మొదటిపేజీ తరువాయి...

తమ ప్రభుత్వం రైతులకు నీళ్లు ఇవ్వలేకపోతున్నదని స్పష్టం చేశారు. 'గత ప్రభుత్వం కారణంగా వర్షాలు పడలేదు. దాంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలకు మా ప్రభుత్వం నీళ్లివ్వలేని పరిస్థితి నెలకొన్నది. నీళ్లు లేకపోతే కొత్తగా వచ్చిన మా ప్రభుత్వాన్ని నిందిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఇటీవల జలసౌధలో జరిగిన సమావేశంలో కోదాడకు నీళ్లిస్తామని ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. ఆయన ప్రకటించిన రెండ్రోజుల్లోనే, మరో మంత్రి పొంగులేటి విరుద్ధ ప్రకటన చేయడం గమనార్హం. వాస్తవానికి 2015 యాసంగిలో సాగర్ జలాశయ నీటిమట్టం 508 అడుగుల్లో ఉన్నా ఎడమ కాల్వ పరిధిలో ఎండిపోతున్న పంటల కోసం నాటి సీఎం కేసీఆర్‌తో మాట్లాడి అప్పటి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి నీటిని విడుదల చేయించారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 514 అడుగుల్లో ఉన్నది. గతంలో పోల్చితే 6 అడుగులు ఎక్కువేఉన్నా నీళ్లివ్వలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పుండటం గమనార్హం. నిన్న నల్లగొండలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా నీళ్లు ఇవ్వలేమని కరాఖండీగా చెప్పారు. దీనిపై ఆయకట్టు రైతు లు మండిపడుతున్నారు. ప్రభుత్వం నీళ్లు విడుదల చేస్తే చివరి దశలో ఉన్న పంటలను కాపాడుకుంటామని ప్రాధేయపడుతున్నారు.